Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 131 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
శుక్రవారం, 28 - 11 - 2025
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ప్రజారాజధాని అమరావతిలో రూ.1,328 కోట్ల పెట్టుబడులు..6,541 ఉద్యోగాలు

**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రజారాజధాని అమరావతి మరో కీలక కార్యక్రమానికి వేదిక కానుంది. ఆర్థిక కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా అమరావతిని తీర్చిదిద్దే కార్యాచరణలో భాగంగా ఈ నెల 28న రాజధానిలోని సిఆర్డిఏ కార్యాలయం వద్ద 15 బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన జరగనుంది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ మరియు ఇతర ప్రముఖ ప్రజాప్రతినిధుల సమక్షంలో బ్యాంకుల కార్యాలయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రాజధాని అమరావతిని ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా అభివృద్ధి చేసే "ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్" బృహత్ ప్రణాళికలో భాగంగా సిఆర్డిఏ ఆధ్వర్యంలో ఇప్పటికే ఈ బ్యాంకులకు అవసరమైన భూముల కేటాయింపు పూర్తయ్యింది. రాజధాని అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి, రాయపూడి, లింగాయపాలెంలో ఈ బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు కొలువు దీరనున్నాయి. మొత్తంగా ఈ యొక్క 15 బ్యాంకుల ద్వారా రూ.1,328 కోట్ల పెట్టుబడులు తద్వారా 6,541 ఉద్యోగాల కల్పన మన రాజధాని అమరావతిలో జరగనుంది. ప్రతిపాదిత పెట్టుబడులు మరియు ఉద్యోగాల వివరాలు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్- రూ.256 కోట్లు-1,000 ఉద్యోగాలు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా- రూ.40 కోట్లు- 300 ఉద్యోగాలు, ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్)- రూ.200 కోట్లు- 400 ఉద్యోగాలు, బ్యాంక్ ఆఫ్ ఇండియా(బిఓఐ)- రూ.40 కోట్లు- 200 ఉద్యోగాలు, కెనరా బ్యాంక్- రూ.50 కోట్లు- 300 ఉద్యోగాలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)- రూ.300 కోట్లు- 2,000 ఉద్యోగాలు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యుబిఐ)- రూ.50 కోట్లు- 160 ఉద్యోగాలు, బ్యాంక్ ఆఫ్ బరోడా- రూ.60 కోట్లు- 300 ఉద్యోగాలు, ఇండియన్ బ్యాంక్- రూ.40 కోట్లు- 105 ఉద్యోగాలు, నాబార్డ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్)- రూ.90 కోట్లు- 160 ఉద్యోగాలు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)- రూ.15 కోట్లు- 150 ఉద్యోగాలు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబి)- రూ.4 కోట్లు- 65 ఉద్యోగాలు, ఐడీబీఐ బ్యాంక్- రూ.50 కోట్లు- 215 ఉద్యోగాలు, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)- రూ.22 కోట్లు- 1,036 ఉద్యోగాలు, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐఏసిఎల్) - రూ.93 కోట్లు- 150 ఉద్యోగాలు.

## ఆన్‌లైన్ కంటెంట్‌పై సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కంటెంట్‌పై ఎవరో ఒకరు బాధ్యత వహించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వ్యక్తులు సొంతంగా ఛానెళ్లు ప్రారంభించి.. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వింతగా ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. గురువారం యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా కేసులో విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారం గురించి ప్రశ్నించడం ద్వారా యూట్యూబర్ రణవీర్ వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశమే కాదన్నారు. సామాజిక మాధ్యమాల్లో యూజర్లు జనరేట్ చేస్తోన్న కంటెంట్‌లోని లోపాలను సైతం ఎత్తిచూపుతోందని తెలిపారు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ అనేది ఒక అమూల్యమైన హక్కు అని అభివర్ణించారు. దానిని వక్రీకరించడం సరికాదని కోర్టుకు ఆయన విన్నవించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. తాను సొంతంగా ఛానెల్ పెట్టాను. తాను ఎవరికీ జవాబుదారీగా ఉండను అనే సంకేతాలు వెళ్తున్నాయని.. ఇది సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్ కంటెంట్ విషయంలో ఎవరో ఒకరు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పుడు ఎందుకు ఈ తరహా ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా ప్రశ్నించింది. వినియోగదారులు సృష్టించిన సోషల్ మీడియా కంటెంట్‌ను నియంత్రించేలా నిబంధనలు తీసుకురావాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అందుకు కేంద్రానికి సుప్రీం కోర్టు నాలుగు వారాల గడువు ఇచ్చింది.

## మళ్లీ తుఫాన్.. పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీలంకను అనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడింది. ఈ మేరకు విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరికల కేంద్రం ఉన్నతాధికారి జగన్నాథ కుమార్ వెల్లడించారు. ఈ తుఫాన్‌కు దిత్వాగా అని యమెన్ పేరు పెట్టిందని తెలిపారు. ఈ తుఫాన్ కారణంగా రానున్న వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు.. మరికొన్ని ప్రదేశాల్లో భారీ వర్షాల నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో తీరం వెంబడి గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. కాబట్టి సముద్రంలో వేటకు వెళ్ళవద్దని మత్స్యకారులను హెచ్చరించారు. తీరం వెంబడి ఉన్న పోర్టులో రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశామని జగన్నాథ కుమార్ వివరించారు. ఇక దిత్వా తుఫాన్ కారణంగా.. శనివారం నుంచి సోమవారం వరకు అంటే.. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయిన అంచనా వేస్తున్నారు. 29వ తేదీన అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఇక 30వ తేదీన నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలో పూర్తిగా భిన్న పరిస్థితులు ఉన్నాయి. మొన్నటి వరకు తెలంగాణలో చలి తీవ్రత అధికంగా ఉంది. కానీ గత నాలుగు రోజులుగా ఈ తీవ్రత తగ్గింది.

## కల్తీ నెయ్యి కేసులో మరొకరు అరెస్ట్

**తిరుమల, (రాజధాని వార్తలు):** తిరుమల కల్తీ నెయ్యి కేసులో విచారణ కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా ఈ కేసులో మరొకరు అరెస్ట్ అయ్యారు. టీటీడీ మార్కెటింగ్ జీఎం సుబ్రహ్మణ్యంను పోలీసులు అరెస్ట్ చేశారు. సుబ్రమణ్యంను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. తిరుపతి రుయా ఆస్పత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు చేయించారు. సుబ్రమణ్యం అరెస్ట్‌తో ఈ కేసులో అరెస్ట్‌ల సంఖ్య.. మొత్తం 10కి చేరింది. వైసీపీ హయాంలో తిరుమలలో లడ్డూ తయారీలో కల్తీకి పాల్పడ్డారన్న ఆరోపణలు తలెత్తిన విషయం అందరికీ తెలిసిందే. 2019 - 2024 మధ్య 20.01 కోట్ల వేంకటేశ్వరస్వామి లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని సిట్ విచారణలో తేలింది. మొత్తం 48.76 కోట్ల లడ్డూలను తయారు చేయగా.. ఆ లడ్డూల్లో 40 శాతం పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్‌తో పాటూ ఇతర రసాయనాలతో తయారు చేశారని నిర్ధారణ అయింది. టీటీడీలోని అప్పటి ధర్మకర్తల మండలి నెయ్యి సరఫరా కోసం.. ఉత్తరాఖండ్‌కు చెందిన భోలేబాబా డెయిరీ, తమిళ నాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ, తిరుపతి జిల్లా పునబాకలోని వైష్ణవి డెయిరీతో పాటూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన మాల్‌గంగ డెయిరీలకు రూ.250 కోట్లు చెల్లించింది. ఈ డెయిరీల నుంచి మొత్తం 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేశారు. అయితే ఇందులో 68 లక్షల కిలోలు కల్తీ నెయ్యి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కల్తీ నెయ్యి కేసులో సిట్ అధికారులు ఇటీవల టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ప్రశ్నించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని వైవీ సుబ్బారెడ్డి నివాసంలో అధికారులు విచారణ చేశారు. అలాగే ఈ కేసులో ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు.

## రాజధానిలో వెంకన్న ఆలయ విస్తరణకు సీఎం భూమి పూజ




**అమరావతి, (రాజధాని వార్తలు):** దేవతల రాజధాని అమరావతి అయితే...ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు సీఎం భూమి పూజ చేశారు. అనంతరం ఓం నమో వేంకటేశాయ అంటూ సీఎం చంద్రబాబు ఉపన్యాసాన్ని ప్రారంభించారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఈ యుగంలో ఏపీలో అవతరించారన్నారు. 2019లో ఆలయాన్ని నిర్మించాలని సంకల్పం చేశామని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి పేరు పెట్టినప్పుడే వేంకటేశ్వర స్వామి తన ద్వారా సంకల్పించారని తెలిపారు. ఇక్కడి రైతాంగం 29 వేల మంది 33,000 ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చారని.. వారిని అభినందిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. వారికి ఆ సంకల్పాన్ని వేంకటేశ్వర స్వామి కల్పించారన్నారు. కృష్ణానది తీరాన పవిత్రమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్మితమైందని తెలిపారు. 1983లో తిరుమలలో అన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రారంభిస్తే.. 2003లో ప్రాణదానం కార్యక్రమాన్ని స్విమ్స్‌లో ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 'మా ఇంటి దైవం వేంకటేశ్వర స్వామి... మా ఇంటి నుంచి చూస్తే ఆయన నామాలు కనిపిస్తాయి' అని చెప్పుకొచ్చారు. ఎప్పుడూ కూడా వేంకటేశ్వర స్వామికి అప్రతిష్ట పాలు తెచ్చే పనిని చెయ్యనని....ఎవరినీ చేయనివ్వనని స్పష్టం చేశారు. వేంకటేశ్వర స్వామి వద్దకు ఎప్పుడు వెళ్ళినా క్యూ లైన్‌లోనే వెళతానని తెలిపారు. ముఖ్యమంత్రిగా కాదు... భక్తుడిగా వెళతానని సీఎం అన్నారు. కొందరు తప్పులు చేస్తారని.. తప్పు చేసిన వారికి ఇంకో జన్మలో శిక్ష ఉంటుందనుకుంటారని.. అయితే తప్పు చేస్తే మాత్రం వేంకటేశ్వర స్వామి ఈ జన్మలోనే శిక్షిస్తారన్నారు. గడచిన ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేసిన పరిస్థితులు లేవని విమర్శించారు. ఐదేళ్లు ఇక్కడ రైతులకు నరకాన్ని చూపించారన్నారు. వేంకటేశ్వర స్వామిని రైతులు నమ్ముకున్నారని.. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు పాదయాత్ర చేసిన ఈ ప్రాంత రైతులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ దేవాలయాన్ని రూ.260 కోట్లతో పూర్తి చేస్తామన్నారు. తిరుపతి ప్రాంగణం తరహాలోనే ఇక్కడ గుడిని నిర్మిస్తామని.. రెండు న్నర సంవత్సరాల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. దేవాలయాల నిర్మాణానికి దాతలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం, ఆనందం, సంపద ప్రతి ఒక్కరికి అందించాలని వేంకటే శ్వర స్వామి ప్రార్థిస్తున్నానని అన్నారు. దేవతల రాజధాని అమరావతి నమూనాగా ఈ అమరావతి ఉండాలని వేంకటేశ్వర స్వామిని కోరుతున్నట్లు తెలిపారు. చివరగా.. ఓం నమో వేంకటేశాయ అంటూ సీఎం చంద్రబాబు ఉపన్యాసాన్ని ముగించారు. ఇక.. రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా భూమిపూజ జరిగింది. రెండు దశల్లో రూ.260 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు జరుగనున్నాయి. ఆలయ ప్రాకారం, మహా రాజగోపురం, మండపాలు, ఆంజనేయ స్వామి ఆలయాల నిర్మాణం జరుగనుంది. మాడ వీధులు, అన్నదాన కాంప్లెక్స్ తదితర నిర్మాణాలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. మొదటి దశలో రూ.140 కోట్లు వ్యయంతో వివిధ పనులు నిర్వహించనున్నారు. రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ మహాప్రాకారం నిర్మాణం జరుగనుంది. ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయ స్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్‌ల నిర్మించనుండగా.. వీటి నిర్మాణాలకు రూ.48 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇక రెండో దశ పనులను రూ.120 కోట్లతో టీటీడీ చేపట్టనుంది. శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు-సిబ్బందికి క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ వంటి పనులను కూడా చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆలయ నిర్మాణం మొదటి విడత పూర్తైన నేపథ్యంలో నేడు శంకుస్థాపన అనంతరం రెండు, మూడవ విడత పనులకు శ్రీకారం చుట్టారు. 4వ విడత పనులను కూడా త్వరలోనే చేపట్టి టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

## మీరా రైతుల పక్షాన మాట్లాడేది.. వైసీపీపై నాదెండ్ల సీరియస్



**విజయవాడ, (రాజధాని వార్తలు):** రైతులకు రూపాయి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 24 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని.. అయినా వైసీపీ నేతలు అన్యాయంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రూ. 1674 కోట్లు బకాయిలు పెట్టి పారిపోయిన వైసీపీ నేతలా రైతుల పక్షాన మాట్లాడేది అంటూ ఫైర్ అయ్యారు. ఇప్పటి వరకు 8 లక్షల 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు. కృష్ణా జిల్లాలో లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం రికార్డ్ అని తెలిపారు. గోదావరి జిల్లాల నుంచి లక్ష టన్నుల పైనే ధాన్యం సేకరించామని చెప్పారు. అధికారులు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని.. వారి మనోధైర్యం దెబ్బతీసేలా వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కృష్ణా జిల్లాలో 2022-23 ఖరీఫ్‌లో కేవలం 13 వేల 560 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని.. 2023-24లో 16 వేల 978 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారని తెలిపారు. తాము మాత్రం లక్షా 7 వేల 960 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని చెప్పుకొచ్చారు. ఖరీఫ్, రబీలో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ట్రాన్స్ పోర్టు వాహనాల బకాయిలు నేడు రూ.9 కోట్లు చెల్లించామని మంత్రి చెప్పారు. 7 కోట్ల 53 లక్షల గోనె సంచులను ఏర్పాటు చేశామన్నారు. సీఎం సూచనలతో లక్ష సంచులు అదనంగా సిద్ధంగా ఉంచామని తెలిపారు. మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియ.. వాతవరణంలో వచ్చిన మార్పులతో ముందే ధాన్యం సేకరించామని చెప్పుకొచ్చారు. రైతుల ఆందోళనను గుర్తించి.. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించిందన్నారు. రైతులు కూడా అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి ఇంత పెద్ద కార్యక్రమం చేస్తున్నామంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చే సూచనలు, ప్రోత్సాహం వల్లే అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కొంతమంది మాఫియాగా ఏర్పడి రైతులను ఇబ్బందులు పెట్టడానికి వారి స్వలాభం కోసం డ్రామాలు ఆడుతున్నారని మండి పడ్డారు. తాము పూర్తి పారదర్శకత కోసం వాహనాలకు జీపీయస్ ఏర్పాటు చేస్తే.. దళారులు రైతులను మాయ మాటలతో మోసం చేస్తున్నారన్నారు. 75 కిలోల బస్తాకు 1792 రూపాయల మద్దతు ధర తాము ఇస్తామని ప్రకటిచాంరు. 30 వ తేదీ వరకు ఏపీలో వర్షాలు లేవని.. ఆ తర్వాత ఐదు జిల్లాల్లో వర్ష సూచనలు ఉన్నా యన్నారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నా మని చెప్పారు. దళారులు చేసే మోసాలు నమ్మవద్దని.. వారిని తరిమికొట్టాలని రైతులను కోరారు. 24 వేల ట్రక్స్.. ధాన్యం తరలిం పుకు జీపీయస్‌తో సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షాల నుంచి కౌలు రైతులను ఆదుకునేందుకు టార్ఫాల్స్‌ను కూడా పూర్తిగా సిద్ధంగా ఉంచామని చెప్పారు. అబద్ధాలు నమ్మి.. తక్కువ రేటుకు ధాన్యం అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేశారు. సివిల్ సప్లయిస్ శాఖ రైతుల కోసం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. క్యాబినెట్ సమావేశం తర్వాత కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మరోసారి పర్యటించి రైతులకు భరోసా ఇస్తామని మంత్రి తెలిపారు. రైతులను తప్పుదోవ పట్టించేలా కొంత మంది అబద్ధపు కథనాలు పత్రికలలో రాస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రాప్ నమోదు మేరకు ఆ పొలంలో వచ్చే దిగుబడిని పూర్తిగా కొనేందుకు తాము రెడీ ఉన్నట్లు వెల్లడించారు. ఫైన్ క్వాలిటీ రైస్‌కు ప్రాధాన్యత ఇచ్చి.. మధ్యాహ్న భోజన పథకానికి వాడుతున్నామన్నారు. ఆ పంట ఎక్కడ ఉన్నా.. ప్రతి బస్తా కొనుగోలు చేయాలని అధికారులకు చెప్పామన్నారు. రాజకీయంగా అసత్యాలు ప్రచారం చేస్తున్న వారికి రైతులే బుద్ధి చెప్పాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# విక్రమ సింహపురిలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు - రాజ్యాంగం భారత ప్రజాస్వామ్యానికి పునాది : వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో 76వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలు, విలువలను స్ఫూర్తిగా తీసుకుని, ప్రతి పౌరుడూ రాజ్యాంగ విలువలను గౌరవించి, తమ బాధ్యతలను నిర్వర్తించాలని ఈ సందర్భంగా ఉపకులపతి (వీసీ) ఆచార్య అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి పునాది: రాజ్యాంగ దినోత్సవం ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాని ప్రారంభించారు. విసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, "రాజ్యాంగం భారత ప్రజాస్వామ్యానికి పునాది" అని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దూరదృష్టి, సామాజిక న్యాయంపై ఆయన నిబద్ధతను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల్లో రాజ్యాంగ అవగాహన కార్యక్రమాలు బలపడితేనే యువతలో ప్రజాస్వామ్య చైతన్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అంతే కాదు, ప్రతి విద్యార్థి ప్రీయాంబుల్‌ను కేవలం పఠించడం కాకుండా, దానిలోని విలువలను ఆచరణలో పెట్టాలని వీసీ ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. సమాజ నిర్మాణంలో యువత పాత్ర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత మాట్లాడుతూ, భారత రాజ్యాంగం సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి మౌలిక విలువల సమాహారమని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ విలువలను హృదయపూర్వకంగా గ్రహించి సమాజ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. రాజ్యాంగంపై లోతైన అధ్యయనం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ టీ.మాధవి మాట్లాడుతూ, రాజ్యాంగం పిల్లల హక్కులకు అత్యున్నత రక్షణ కల్పించిందని, భద్రత, విద్య, ఆరోగ్యం వంటివి మౌలిక హక్కులని పేర్కొన్నారు. పిల్లలపై హింస, బాల్యవివాహాలు, బాలకార్మికత్వం వంటి సమస్యలను నిర్మూలించడానికి సమాజం మొత్తం కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆమె ఉద్ఘాటించారు. సోషల్ వర్క్, ఎన్‌ఎస్‌ఎస్ వంటి వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. మేరా యువభారత్ నెల్లూరు డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగం యువతకు దిశా నిర్దేశం చేసే జీవన పత్రం అని, దేశ నిర్మాణంలో యువత పాత్ర అపారమైనదని అన్నారు. రాజ్యాంగ విలువలను ఆచరణలో పెట్టినప్పుడే దేశం నిజమైన అభివృద్ధి దిశగా సాగుతుందని తెలిపారు. నైతిక విలువలు, సామాజిక బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంచే విధంగా మేరా యువభారత్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాజ్యాంగ దినోత్స వాన్ని పురస్కరించుకొని విద్యార్థుల కోసం ఎలక్యూషన్, ఎస్సే రైటింగ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు బహుమతులు పంపిణీ చేశారు. ప్రతిజ్ఞతో ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సి.హెచ్. విజయ అధ్యక్షత వహించగా, సమన్వయకర్త డాక్టర్ పి.సి.చెంచు రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ వేడుకల్లో విభాగ అధ్యాపకులు Dr.B.Prabhakara Rao, Dr. V.Govindu, Dr. G. Sunil Kumar, Dr. M. Obulapathi, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీసర్ పి.హరికృష్ణ, సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జి.హరికృష్ణతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులందరూ భారత రాజ్యాంగ విలువలను కాపాడుతామని, ప్రజాస్వామ్య బాధ్యతలను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ఐపీఎస్ అధికారి సస్పెన్షన్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

**అమరావతి, (రాజధాని వార్తలు):** సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ సస్పెన్షన్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన సస్పెన్షన్‌ను మరో ఆరు నెలల పాటు పొడిగించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు గురువారం జారీ చేసింది. దీంతో వచ్చే ఏడాది మే నెలాఖరు వరకు సంజయ్‌పై సస్పెన్షన్ విధించినట్లు అయింది. సంజయ్ సస్పెన్షన్‌కు సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులు నవంబర్ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ ఎన్ సంజయ్ పని చేశారు. ఆ సమయంలో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక అందింది. దాంతో ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణకు ప్రభుత్వం



ఆదేశించింది. ఆ కొద్ది రోజులకే సం జయ్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ కేసులో అరెస్టయిన సంజయ్.. ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

# విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఎన్‌ఇపి-2020, ఏబిసిపై ప్రత్యేక అవగాహన - విద్యార్థి - కేంద్రీకృత విద్యకు బలమైన వేదిక






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నూతన జాతీయ విద్యా విధానంలో కీలకమైన సంస్కరణ అయిన అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ వ్యవస్థ ప్రాముఖ్యతపై విక్రమ సింహపురి యూనివర్సిటీలోని సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకుల కోసం ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై, కీలక ప్రసంగం చేశారు. ముఖ్య ప్రసంగకర్తగా NCERT, నెల్లూరు రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుండి ఆచార్య బి.రమేష్ బాబు (ప్రొఫెసర్ ఇన్ ఎడ్యుకేషన్ & ఓఎస్‌డి) పాల్గొని ఏబిసి అమలు, ప్రాధాన్యతపై లోతైన సూచనలు అందించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత గౌరవ అతిథి విచ్చేసారు. వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, నూతన విద్యా విధానం విద్యార్థి-కేంద్రీకృత విద్యకు మార్గం సుగమం చేస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా అమలు అవుతున్న ఏబిసి వ్యవస్థ వల్ల విద్యార్థులకు లభించే ముఖ్య ప్రయోజనాలను ఆయన వివరించారు: ప్రస్తుత కాలానికి అనుగుణంగా క్రెడిట్‌లు: విద్యార్థులు తమ విద్యాభ్యాసానికి అనుగుణంగా క్రెడిట్‌లను సంపాదించుకోవచ్చు. డిజిటల్ క్రెడిట్ భద్రత: వివిధ సంస్థల్లో సాధించిన క్రెడిట్‌లను డిజిటల్‌గా భద్రపరచుకునే అవకాశం. క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ సౌకర్యం: అవసరాన్ని బట్టి ఈ క్రెడిట్‌లను ఇతర సంస్థలకు బదిలీ చేసుకునే అవకాశం. ముఖ్యంగా, బహుళ ప్రవేశాలు-బహుళ నిష్క్రమణలు సమర్థవంతంగా అమలు కావడానికి ఏబిసి ఒక బలమైన వేదికగా పనిచేస్తుందని వీసీ స్పష్టం చేశారు.

కీ-నోట్ స్పీకర్ సూచనలు: డిజిటల్ అకడమిక్ మొబిలిటీ కీ-నోట్ స్పీకర్ ఆచార్య బి.రమేష్ బాబు ఏబిసి వ్యవస్థలో ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించారు. డిజిటల్ రికార్డుల ఆవశ్యకత: విద్యార్థుల డిజిటల్ అకడమిక్ రికార్డుల నిర్వహణ ప్రాముఖ్యత. క్రెడిట్ మార్పిడి విధానం: ఒక కోర్సు నుండి మరొక కోర్సుకు క్రెడిట్‌లను మార్చుకునే విధానం. జాతీయ అకాడమిక్ మొబిలిటీ: విద్యార్థులు ఒక సంస్థ నుండి మరొక సంస్థకు సులభంగా మారే సౌలభ్యం. విద్యార్థులు ఎన్‌ఇపి 2020 కల్పిస్తున్న కొత్త అవకాశాలను సద్వినియోగం చేసుకోవా లని ఆయన పిలుపునిచ్చారు.

**తప్పనిసరిగా నమోదు కావాలి: రిజిస్ట్రార్**

రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ, ఏబిసి అమలులో యూనివర్సిటీ తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, విద్యార్థులందరూ ఈ డిజిటల్ వేదికలో తప్పనిసరిగా నమోదు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, పరిక్షల నియంత్రణ అధికారి డా.ఆర్.మధుమతి, NEP Nodal Officer, PM USHA Activity Coordinator cum Organizing Secretary, డాక్టర్ జి విజయలక్ష్మి మరియు కోఆర్డినేటర్లు డాక్టర్ కె వి ఎల్ శ్రీ కన్య రావు, డాక్టర్ యన్ ఓ గోపాల్, డాక్టర్ పి సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా "జాతీయ రాజ్యాంగ దినోత్సవం" నిర్వహణ










**కాకినాడ, (రాజధాని వార్తలు):** భారత ప్రభుత్వ సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ - కాకినాడ ఫీల్డ్ ఆఫీస్, రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా - సంయుక్తంగా నేడు 76వ జాతీయ రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన్ దివస్)ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది మేధావులు, ప్రముఖులు, న్యాయవాదులు పాల్గొని రాజ్యాంగ విలువలు, ప్రాముఖ్యతల గురించి విద్యార్థులకు అనేక విషయాలు తెలియజేశారు. కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై.సుబ్రహ్మణ్యం ముఖ్యోపన్యాసం చేశారు. ఎంత గొప్ప రాజ్యాంగం అయిన దాని విజయం అమలు చేసే వారిపై ఆధారపడి ఉంటుందన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాటలను ఉటంకించారు. విద్యార్థులకు న్యాయవాద వృత్తి, పౌరులకు రాజ్యాంగం అందించిన విలువైన హక్కులపై మాట్లాడారు. నేటి న్యాయ విద్యా విద్యార్థులు.. రానున్న రోజుల్లో కేవలం న్యాయవాదులు మాత్రమే కాదని, రాజ్యాంగ ధర్మకర్తలు అని గుర్తుచేశారు. సమాజంలో ఎంతో మంది, ఎన్నో రకాలుగా అన్యాయానికి గురవుతుంటారని, వారికి అండగా ఉండేందుకే.. రాజ్యాంగం అనేక అవకాశాల్ని కల్పించిందన్నారు. భూమిని కోల్పోతున్న రైతుల కోసం ఆర్టికల్ 300ఏ, భయం కారణంగా నిశ్శబ్దంగా ఉన్న పౌరుల కోసం ఆర్టికల్ 19(1)(ఏ), విద్యకు నోచుకోని బాలల కోసం ఆర్టికల్ 21ఏ రక్షణగా ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. న్యాయవాదులుగా గెలిచిన కేసుల సంఖ్యను బట్టి కాదని, ఎలాంటి సమస్యలపై పోరాడారనే దాన్ని బట్టి చరిత్ర గుర్తిస్తుందంటూ కర్తవ్య బోధ చేశారు. యువతలో రాజ్యాంగ అవగాహనను పెంపొందించడం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దార్శనికతను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లేందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ దేశవ్యాప్తంగా చేసిన ప్రయత్నాలను కాకినాడలోని సిబిసి ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీరామమూర్తి కందాల, ఐఐఎస్ ప్రస్తావించారు. రాజ్యాంగ విద్య పాఠ్య పుస్తకాలకు మించి ప్రతి న్యాయ విద్యార్థికి జీవన విధానంగా మారాలని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా డైరెక్టర్ బలరాం అన్నారు. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో పౌరుల ప్రాథమిక హక్కులు, ముఖ్యంగా ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులకు సంబంధించిన ఏడిఎం జబల్పూర్ కేసును రాజ్యాంగ నిపుణుడు డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ ప్రస్తావించారు. ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో మిగతా నలుగురితో విభేదించి మరీ.. అత్యవసర పరిస్థితులు పౌరుల హక్కుల్ని లాక్కోలేవు అని ధైర్యంగా తీర్పు రాసిన జస్టిస్ హెచ్.ఆర్. ఖన్నా నుంచి తాను ప్రేరణ పొందినట్లు తెలిపారు. ప్రజాదరణ పొందినా, లేకున్నా రాజ్యాంగానికి అన్ని విధాలా మద్ధతుగా నిలవడమే నిజమైన గొప్పతనమని లా విద్యార్థులకు సూచించారు. వృత్తిపరమైన, వ్యక్తిగత ప్రవర్తన రెండింటిలోనూ రాజ్యాంగాన్ని రోజువారీ మార్గదర్శకంగా పరిగణించాలని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ జయప్రసాద్ పిలుపునిచ్చారు. సంవిధాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా, విద్యార్థులకు రాజ్యాంగంపై క్విజ్, లఘు సమాధాన రచన పోటీలను నిర్వహించారు. విజేతలకు, పోటీల్లో పాల్గొన్న వారికి ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. రాజ్యాంగ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వారిని ప్రశంసిస్తూ కాకినాడలోని సిబిసి ఫీల్డ్ ఆఫీస్ తరపున శ్రీరామమూర్తి కందాల సన్మానించారు. ఈ సందర్భంగా, కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడమే కాదని, న్యాయాన్ని అర్థం చేసుకోవడానికి, కోర్టులలో నిర్భయంగా వాదించడానికి, కోర్టు వెలుపల కూడా రాజ్యాంగ విలువలను పాటించడానికి కట్టుబడి ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం, న్యాయ దినోత్సవ వేడుకలు : న్యాయవాది సామాజిక వేత్త ఇర్ల వెంకటరమణయ్య

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని విఆర్సీ కూడలి నందు ఉన్న భారతరత్న భారత రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద న్యాయవాది సామాజికవేత్త ఇర్ల వెంకటరమణయ్య ఆధ్వర్యంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం మరియు న్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని రూపొందించి పార్లమెంట్‌లో ఆమోదించారని తెలిపారు ప్రపంచ రాజ్యాంగాలన్నిటికంటే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనదేనన్నారు దేశ ప్రజలందరికీ రాజ్యాంగం ద్వారానే సమాన హక్కులు కలిగాయని పేర్కొన్నారు నేటి పౌరులు రాజ్యాంగాన్ని అభ్యసించి సమాజంలో ఉత్తమమైన పౌరులుగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో



రాజ్యాంగపు పుస్తకాలను పంపిణీ చేశారు పెంచలయ్య హేమంత్ వెంకటేష్ మనోజ్ మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బాబా సాహెబ్

**- అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన దూడల పెంచలయ్య**








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పడమటి నాగులదొరువు ప్రాథమిక పాఠశాలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన ప్రధానోపాధ్యాయుడు దూడల పెంచలయ్య ఈ సందర్భంగా దూడలు పెంచలయ్య మాట్లాడుతూ అంబేద్కర్ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అను మానవీయ విలువలను రాజ్యాంగ పీఠికలో పొందుపరచడం జరిగింది. రాజ్యాంగం ఎంత గొప్పదైనప్పటికీ దానిని అమలు చేసే పాలకులు మంచివారైతే రాజ్యాంగం మంచిగా అమలవు తుంది పాలకులు చెడుగా అమలు చేస్తే చెడుగానే అమలవుతుంది. దేశంలోని ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు సమాన హక్కులు కలిగి ఉండాలని ప్రతి పౌరుడికి న్యాయం అందేటట్లు రాజ్యాంగంలో పొందుపరిచారు. రాజ్యాంగానికి ప్రజాస్వామమే ప్రాణం లాంటిది రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్యక హక్కులను కాపాడాల్సిన బాధ్యత పాలకుల మీదనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

# రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్‌కు నివాళులు

**- రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది - ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు, రక్షణ కల్పించింది భారత రాజ్యాంగం - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విడవలూరులో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేను ఎమ్మెల్యేగా ఇక్కడ ఉన్నా.. మీరు ప్రశాంత జీవితం అనుభవిస్తున్నా అది మనకు రాజ్యాంగం కల్పించిన హక్కే అన్నారు. రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది అని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు, రక్షణ కల్పించిన భారత రాజ్యాంగ ఘనతను ఆమె వివరించారు. 1949 నవంబర్ 26న మన రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించింది. 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని అర్థం చేసుకుని, దాని విలువల ఆధారంగా జీవితాన్ని కొనసాగించాలని కోరారు.

# విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఘనంగా 'రాజ్యాంగ దినోత్సవ సంబరాలు'




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాజ్యాంగ దినోత్సవం నాడు మనం ఈ గొప్ప దేశంలోని పౌరులుగా మన విధులను నెరవేరుస్తామన్న మన ప్రతిజ్ఞను పునరుద్ఘాటించాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, నెల్లూరు క్షేత్ర కార్యాలయం మరియు నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ సహకారంతో బుధవారం నిర్వహించిన 'రాజ్యాంగ దినోత్సవ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తి అమలు ద్వారా మనం అభివృద్ధి చెందిన, సాధికారత కలిగిన భారత్ నిర్మాణానికి అర్థవంతమైన సహకారం అందించగలమని ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసులు అన్నారు. యువతను ప్రేరేపించేందుకు ప్రతి నవంబర్ 26న కళాశాలల్లో 18 ఏళ్లు నిండేవారిని ఉద్దేశించి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా యువతలో చైతన్యం నింపి మరియు భారత రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్యం పట్ల అవగాహన పెంచి మెరుగైన భారతదేశాన్ని నిర్మించడంలో యువతను భాగస్వామ్యులు చేయాలని తెలిపారు. నెల్లూరు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ప్రతినిధి పి.హరికృష్ణ మాట్లాడుతూ ముంబైలోని ఇందు మిల్స్ కాంపౌండ్స్‌లో అంబేద్కర్ స్మారక చిహ్నానికి పునాది రాయి వేస్తున్నప్పుడు, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నవంబర్ 26ని రాజ్యాంగ దినోత్సవంగా భారత ప్రజలందరూ జరుపుకోవాలని ప్రకటన చేశారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజును గుర్తు చేసుకోవడం, రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కృషిని గౌరవించడం కోసం 'సంవిధాన్ దివస్' పాటిస్తున్నామని తెలిపారు. భారత ప్రజలకు ప్రజాస్వామ్య విలువలు, ప్రాథమిక హక్కులు, దేశం యొక్క పాలనా విధానం వంటి వాటిపై మరింత అవగాహన కల్పించాలన్నారు. యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, బోధన మరియు బోధినేతర సిబ్బంది రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన మరియు వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. తర్వాత విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది ర్యాలీగా వెళ్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయ, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జి హరికృష్ణ, డిస్టిక్ యూత్ ఆఫీసర్ ఏ మహేంద్ర రెడ్డి డాక్టర్ పి చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్ ఉన్న పంటలను పండించండి

**- ఇప్పటికే రెండు విడతలు యూరియా పంపిణి చేసాం, త్వరలో మూడో విడత పంపిణి చేస్తాం - చిన్న, సన్నకారు రైతుల కోసమే యూరియా కార్డుల విధానాన్ని ప్రవేశపెట్టాం - ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించండి - సాగునీటి కాలువలలో పూడిక సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి, సత్వరమే పరిష్కరిస్తా - ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన పట్ల ఆసక్తి వున్న రైతులకు ఎంఎస్ఎంఇ ద్వారా ఆర్థిక సహాయం చేస్తాను - రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గంలో 20 ఏళ్లుగా అపరిష్కృతంగా వున్న సాగునీటి కాలవల్లో సిల్ట్ క్లియరెన్స్ సమస్యను పరిష్కారం పట్ల ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో పొలంగట్లపై నిర్వహించిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె కూటమి ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ విధానాలను రైతులకు వివరించారు.పార్లపల్లిలో టిడిపి నాయకులు మరియు రైతులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతుల కోసమే యూరియా కార్డుల విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. విమర్శలు చేయడం తప్ప ప్రతి పక్షాల వల్ల వరిగేదేమి లేదనన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని ఆమె రైతులకు సూచించారు. వ్యవసాయానికి ఉపయోగపడే ఆధునికి యంత్ర పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని వ్యవసాయ శాఖ అధిరులను పంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకొని రైతులు లబ్ది పొందాలని కోరారు. డిమాండ్ వున్న పంటలను పండించాలని ఆమె రైతులను కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి సుపారిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆమె కోవూరు నియోజకవర్గ రైతాంగం తరుపున ఆమె ధన్యవాదాలు తెలియచేశారు. యూరియా కొరతపై ప్రతి పక్షాలు అనవసర అసత్య ప్రచారం చేస్తున్నాయని, రైతులకు ఇప్పటికే రెండు విడతలు యూరియా పంపిణి చేశామని త్వరలో మరో విడత పంపిణీ చేస్తామన్నారు. రైతుల సాధక బాధలు ప్రత్యక్షంగా తెలుసుకోవడమే రైతన్నా.. మీకోసం కార్యక్రమ లక్ష్యమన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా ఇప్పటికే రెండు విడతలుగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసిన విషయాన్ని ఉటంకిస్తూ సాంకేతిక కారణాలతో ఎవరికైన అన్నదాత సుఖీభవ అందకుంటే సచివాలయంలో వివరాలు నమోదు చేయాలని సూచించారు. భగవంతుడి దయ వల్ల కోవూరు నియోజకవర్గంలో ఎటువంటి సాగునీటి సమస్యలు లేవని ఆయకట్టు చివరి ఎకరాకు సైతం సాగునీరందించేందుకు కాలువలలో పూడిక తీసిన విషయాన్ని ఆమె రైతులకు గుర్తు చేస్తూ ఎక్కడైనా సిల్ట్ క్లియరెన్స్ సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడీ అనిత, విడవలూరు టిడిపి అధ్యక్షులు ఏటూరి శ్రీహరి రెడ్డి, టిడిపి నాయకులు అడపాల శ్రీధర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, ఆడపాల జనార్ధన్ రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, సత్యం రెడ్డి, రామిశెట్టి వెంకటరర్లు, ఏసోబు, వెంకటరమణయ్య మరియు టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

# గిరిజనులకు అండగా ఉంటాను

**- గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ డ్రైవ్ కోవూరు నుంచి మొదలైంది - యానాది కార్పొరేషన్ కోసం కృషి చేస్తాను - గిరిజన సమస్యలపై శాసనసభలో గళమెత్తి ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చాను - ప్రజాసేవ చేసేందుకే రాజకీయాలలోకి వచ్చాను - ఏఆర్‌డి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సామాజికంగా వెనుకబడి వున్న గిరిజనుల ఆర్థికాభివృద్ధికి పాటు పడతానన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో ఎఆర్‌డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె 500 గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల వెనుకబాటుతనం పై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోవాలంటే కావలసిన కనీస ఆధార్ కార్డు గుర్తింపుకు కూడా నోచుకోని గిరిపుత్రుల దీన పరిస్థితి తెలుసుకొని జిల్లాలో గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ డ్రైవ్ చేపట్టింది కోవూరు నియోజకవర్గం నుంచేనన్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసారు. పేదరికంలో వున్న గిరిజనులను ఆదుకునేందుకై కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా 1985 గిరిజన కుటుంబాలను గుర్తించి వారికి నిత్యావసర సరుకులు పంపిణి చేస్తున్న ఎ ఆర్ డి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు బషీర్ గారిని అభినందించారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రజాసేవ చేస్తున్న తాను సైతం విస్తృత స్థాయిలో ప్రజాసేవ చేసేందుకుకే రాజకీయాలలోకి వచ్చినట్లు పేర్కొన్నారు. నెల్లూరులోని తన నివాసం ఏదోఒక పని పై వచ్చేవారితో నిత్యం జనసందడిగా ఉంటుందన్నారు. ఆపదలో వున్న వారిని ఆదుకోవాలన్న లక్ష్యంతోనే తన రాజకీయ ప్రయాణం మొదలైందని తెలిపారు. కార్యదక్షత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పని చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజలలో వుంటూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని చంద్రబాబు సూచనల మేరకు ప్రజలతో మమేకమై పని చేస్తున్నట్టు వివరించారు. యానాది కార్పొరేషన్ సాధనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గిరిజనులకు హామీ యిచ్చారు. ప్రతి శాసనసభ సమావేశంలో గిరిజన సమస్యలపై గళమెత్తి ముఖ్యమంత్రి దృష్టికి తెస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో విడవలూరు టిడిపి అధ్యక్షులు ఏటూరి శ్రీహరి రెడ్డి, టిడిపి నాయకులు అడపాల శ్రీధర్ రెడ్డి, ఆడపాల జనార్ధన్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, సత్యం రెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఏసోబు, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీతారాంపేట పంచాయతీలో రైతన్న - మీకోసంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఏర్పేడు మండలం టిడిపి అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు అధ్యక్షతన బుధవారం సీతారాంపేట పంచాయతీలో రైతన్న - మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి రైతులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు, ప్రభుత్వ పథకాల గురించి ప్రత్యేకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు తహసీల్దార్ భార్గవి, ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, నైనూరు పున్నారావు, మోహన్ నాయుడు, యూనిట్ ఇంచార్జెస్ బాబు నాయుడు, కేశినేని సుబ్రహ్మణ్యం, రాయపనేని రవి నాయుడు, రాచటి సుబ్రహ్మణ్యం, పిఎసిఎస్ ఛైర్మన్ మహేష్ రెడ్డి, బూత్ ఇం చార్జి కేకే రమణ, అమందూర్ సర్పంచ్ గుణాయాదవ్, క్రిష్ణవేణి, దుర్గిపేరి మునెయ్య, గోపాలరెడ్డి, రాఘవేంద్ర, సురేష్, శీను, నరసింహులు, వెంకటయ్య, వెంకట రమణ, నరేంద్ర, దినకర్‌నాయుడు, వై.మనోహర్ నాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రేపటి భారత్‌కు ఒక భావయోధుని బాట

ఇరవయో శతాబ్ది నవంబర్ 19, 2025న ముగిసింది. సోషలిస్టు భావజాలానికి చిరిగిపోయిన జెండా చిహ్నం లాంటి సచ్చిదానంద్ సిన్హా ఆ రోజున కన్నుమూశారు. ఆయన మరణం ఇరవయో శతాబ్దికి ముగింపు అని నేను సునిశ్చితంగా విశ్వసిస్తున్నాను. అవును, ఒక శకం ముగిసింది. పట్టభద్రుడు కూడా కాని సచ్చిదా జీ మేధా దిగ్గజంగా ప్రభవించారు. మానవుడు నిర్మించిన, నిర్మిస్తోన్న సమస్త చరిత్రను సాధికారంగా వివరించగల వివేకశీలి, అంతఃప్రేరణతో ఒక సమున్నత లక్ష్య సాధనకు అంకితమైన ఆలోచనాశీలి సచ్చిదా జీ. తాను విశ్వసించిన భావజాలానికి విశేష గౌరవాన్ని సమకూర్చి, ప్రజామోదాన్ని సాధించిన సోషలిస్టు ఆలోచనా యోధుడు సచ్చిదానంద్ సిన్హా. ఆయన నిష్క్రమణతో సోషలిస్టు భావజాల సంప్రదాయం కాలంలోకి జారిపోయింది. నాకు తెలిసిన సోషలిస్టు భావజాల ప్రాభవం అంతరించింది. సచ్చిదానంద్ సిన్హా లాంటి ఆలోచనా యోధుడి మరణాన్ని మేధా ప్రపంచం పట్టించుకోకపోవడం ఈ కాలం లక్షణమేమో?! విద్యా ప్రపంచంలో ఇప్పుడు ప్రభావశీలురుగా ఉన్నవారెవరూ బహుశా, సచ్చిదా జీ గురించి విని ఉండకపోవచ్చు. ఇక మీడియా ప్రతినిధులు కూడా అందుకు భిన్నమైన వారు కాదు. పట్నా నుంచి వెలువడే హిందీ దినపత్రిక 'ప్రభాత్ ఖబర్', న్యూఢిల్లీ నుంచి వెలువడే 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో మాత్రమే ఆయన మరణ వార్త వచ్చింది. సమాజం బాగు కోసం శ్రమించిన కొంతమంది ఆలోచనాపరులను విస్మృతులను చేసిన కారణాలు సచ్చిదా జీ విషయంలో వర్తించవు. చాలా మంది క్రియాశీలురు అయిన ఆలోచనాపరుల వలే కాకుండా సచ్చిదా జీ విస్తృతంగా రచనా వ్యాసంగం చేశారు. ఆరు దశాబ్దాల ప్రజా జీవితంలో ఆయన రెండు డజన్లకు పైగా పుస్తకాలు, వందలాది వ్యాసాలు రాశారు. చాలా మంది సోషలిస్టుల వలే సచ్చిదా జీ కూడా ఆంగ్ల భాషను వ్యతిరేకించలేదు. తన రచనా వ్యాసంగం తొలి కాలంలో చాలా పుస్తకాలు, వ్యాసాలు ఇంగ్లీష్‌లోనే రాశారు. 'సోషలిజం అండ్ పవర్', 'ది ఇంటర్నల్ కాలనీ', 'ది బిటర్ హార్వెస్ట్', 'ది క్యాస్ట్ సిస్టమ్' 'కేయాస్ అండ్ క్రియేషన్' మొదలైన ఆయన ఆంగ్ల రచనలు భారతీయ సోషలిస్టు భావ జగత్తులో సుప్రసిద్ధమైనవి. ఆయన ప్రతి పుస్తకమూ సంబంధిత అంశాన్ని లోతుగా పరిశోధించి, స్థిరపడిన నమ్మకాలను నిశితంగా ప్రశ్నించింది. కొత్త ఆలోచనలను ప్రేరేపించింది. ఎనిమిది సంపుటాల 'సచ్చిదానంద్ సిన్హా రచనావళి' పేరిట ఆయన రచనలు ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నాయి. ఆయన మౌలిక చింతకుడు. అసంపూర్ణంగా మిగిలిపోయిన మార్క్స్ 'పెట్టుబడి' గ్రంథం నాల్గవ భాగం గురించి 1950ల్లోనే సచ్చిదా జీ చాలా నిశితంగా, విపులంగా రాశారు. సమాజ భావి పునర్నిర్మాణానికి ఒక ప్రణాళికను ఆయన వెలయించారు. సౌందర్యశాస్త్రంలో కొత్త భావాలను ప్రతిపాదించారు. ఆయన వలే విస్తృతంగా వివిధ అంశాలపై రాసిన వ్యక్తి మరెవరైనా విద్యా ప్రపంచంలో ప్రముఖుడుగా వెలుగొందేవారు. అయితే సచ్చిదా జీకి అటువంటి ప్రఖ్యాతి లభించలేదు. ఆ అనామకత్వానికి పాక్షిక కారణం ఆయన అసాధారణ జీవనయానమే. బిహార్‌లో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో సచ్చిదా జీ జన్మించారు. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో ఆయన రాజకీయ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ క్రియాశీలత ఆయన్ను సోషలిస్టు ఉద్యమంలోకి తీసుకువెళ్లింది. ఫలితంగా ఆయన తన కళాశాల విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పవలసి వచ్చింది. బీఎస్సీ మొదటి సంవత్సరంలోనే ఆయన తన చదువును నిలిపివేశారు. ఇప్పుడు జార?ండ్ రాష్ట్రంగా ఉన్న ప్రాంతాలలోని గని కార్మికుల మధ్య పనిచేయాలని సోషలిస్టు పార్టీ సచ్చిదా జీని ఆదేశించింది. అక్కడ ఆయన కార్యదక్షతను గమనించిన పార్టీ నాయకత్వం ముంబైలో రైల్వే, ఓడరేవు కార్మికులను సంఘటితం చేసే బాధ్యతను అప్పగించింది (బిహార్ రాష్ట్ర ప్రభుత్వంలో సొంత తాతయ్య మంత్రిగా ఉండగా సచ్చిదానంద్ సిన్హా ముంబైలో రైల్వే కార్మికుడుగా ఉన్నారు). ప్రథమ సార్వత్రిక ఎన్నికల (1952)లో ముంబైలో డాక్టర్ అంబేడ్కర్ తరఫున ఎన్నికల ప్రచారంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. ముంబైలో ఆయన రాజకీయ విద్యాభ్యాసం పరిపూర్ణమయింది. పార్టీ కార్యాలయంలోని గ్రంథాలయాన్ని అందుకు ఆయన పూర్తిగా వినియోగించుకున్నారు. సాయంకాలం అధ్యయన శిబిరాలలో పాల్గొనేవారు. ఫ్రెంచ్, జర్మన్ భాషలను కూడా నేర్చుకున్నారు. సచ్చిదా జీ తొలి వ్యాసాలలోని మేధా నైశిత్యాన్ని గమనించిన రామ్‌మనోహర్ లోహియా తన మ్యాగజైన్ 'మ్యాన్ కైండ్' సంపాదకవర్గంలో చేరాలని సచ్చిదా జీని ఆహ్వానించారు. మేధావి అయిన సచ్చిదా జీ రాజకీయ కార్యకర్తగానే ఉండిపోయారు. పార్టీ పదవులకు సైతం ఆరాటపడలేదు. భావాలనే తన రాజకీయాలకు ప్రధాన ఆలంబనగా చేసుకున్నారు. ఢిల్లీలో రెండు దశాబ్దాలు గడిపిన అనంతరం స్వస్థలమైన ముజాఫర్‌నగర్ జిల్లాలోని మనికా గ్రామానికి తిరిగివచ్చి తన జీవితంలో చివరి నాలుగు దశాబ్దాలు అక్కడే ఉండిపోయారు. పదవులు, అవార్డులు, ఫెలోషిప్‌లకు ఆయన ఆరాటపడలేదు. చాలా కొద్ది మంది సోషలిస్టు కార్యకర్తలు, హిందీ రచయితలకు మినహా సచ్చిదాజీ మేధా ప్రపంచానికి బయటి మనిషిగానే ఉండిపోయారు. విశ్వవిద్యాలయాలలో కమ్యూనిస్టులకు ఉన్నట్టుగా సోషలిస్టులకు పలుకుబడి లేదు ఈ కారణంగానే ఆయన మేధా కృషి గుర్తింపునకు నోచుకోలేకపోయింది. తనకు రావలసిన పేరు ప్రఖ్యాతులు రానందుకు సచ్చిదా జీకి ఎటువంటి పట్టింపూ లేదు. అయితే ఆలోచనల ప్రపంచానికి ఆయన భావాల ఉపయుక్తత అపారంగా ఉన్నది. ఈ సత్యాన్ని గుర్తించడమే సచ్చిదాజీకి సముచిత నివాళి అవుతుంది.

# బాలికోన్నత పాఠశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం - ఆకట్టుకున్న "మాక్ అసెంబ్లీ"






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అద్దూరి పైడితల్లి, పతివాడ మంగాదేవి ఆధ్వర్యంలో విద్యార్థునీలతో చేపట్టిన "మాక్ అసెంబ్లీ "విశేషంగా ఆకట్టుకుంది. అధికార, ప్రతిపక్ష పార్టీల హోదాల్లో విద్యార్థినిలు పోషించిన పాత్రలు ఔరా.. అనిపించాయి. సమకాలీన అంశాలపై స్పీకర్ నిర్వహించిన చర్చ చక్కగా సాగింది. అలాగే చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు కూడా ఆకట్టుకున్నాయి. అంతకుకముందు ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం గురించి విపులముగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# న్యాయం ప్రతి ఒక్కరికి సమానమని తెలిపిన సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** న్యాయ దినోత్సవం, వరకట్న నిర్మూలన దినోత్సవం సందర్భంగా 12వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు ఈరోజు శ్రీకాళహస్తి పట్నంలోని కోర్టు ఆవరణలో అవగాహన కల్పించిన సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పార లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. న్యాయమూర్తి బేబీ రాణి మాట్లాడుతూ... ఉచిత న్యాయ సేవలను అందించడానికి చట్టాలు న్యాయ సంబంధిత విషయాలపై అవగాహన కల్పించేందుకు మరియు వివాదాలు సామరస్యంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. భారతదేశంలో 1960 అమలులోకి వచ్చిన వరకట్న నిషేధ చట్టం వివాహాలలో వరకట్నం ఇవ్వడం లేదా స్వీకరించడానికి నిరోధించడం లక్ష్యంగా పెట్టుకుంది ఇది అన్ని మతాలకు వర్తిస్తుంది మరి వరకట్నం డిమాండ్ చేసినందుకు శిక్షలకు కూడా ఉన్నాయి. వరకట్న సంబంధిత హింసకు వ్యతిరేకంగా దాన్ని అమలును బలోపేతం చేయడానికి సవరణలు చేపట్టాయి. మరిన్ని ఉచిత న్యాయ సలహాల కోసం 15100 సంప్రదించాలని కోరారు.


# రైతన్న మీకోసం కార్యక్రమాన్ని పర్యవేక్షించిన జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్




**విజయనగరం/మెరకముడిదాం, (రాజధాని వార్తలు):** మెరక ముడిదాం మండలం బుధరాయవలస గ్రామంలో నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామంలో సాగుతున్న రైతు సర్వే, పంటల స్థితి, పంట నష్టాల అంచనా, రైతులకు అందుతున్న సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రైతు సమస్యలు, సూచనలు, అవసరాలు గ్రామ స్థాయిలోనే తెలుసుకొని వాటిని వెంటనే సంబంధిత విభాగాల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ప్రతి ఇంటిని సందర్శించి సర్వేను ఖచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

## - నెల ముందే ప్రారంభమైన క్రిస్మస్ సందడి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** క్రైస్తవ ప్రజల ప్రధాన పండగ అయిన క్రిస్మస్ వేడుకలు సామర్లకోట పట్టణంలో నెల రోజులు ముందే ఘనంగా ప్రారంభమయ్యాయి. సెమీ క్రిస్మస్ పేరట క్రైస్తవ దేవాలయాలపై నక్షత్రాలను ఏర్పాటు చేసి క్రిస్మస్ సంబరాలను ఘనంగా ప్రారంభించారు. సెమీ క్రిస్మస్, క్రిస్మస్ జ్యోతి అనే పలు పేర్లతో ఈ వేడుకలు ప్రారంభించారు. సామర్లకోట పట్టణంలోని ప్రముఖ క్రైస్తవ దేవాలయాలైన ఆంధ్ర జూబిలీ బాప్టిస్ట్ చర్చి, అగస్థాన సెంటినరీ లూథరన్ చర్చి, ట్రూ గాస్పల్ చర్చి, షాలేము బాప్టిస్ట్ చర్చి వంటి దేవాలయాల్లో ఈ ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సవాలతో ప్రారంభించారు. ఆంధ్ర జూబ్లీ బాప్టిస్ట్ చర్చి దైవజనులు రెవరెండ్ బివి రాజు, లూథరన్ చర్చి దైవజనులు రెవ. సామ్యూల్ ప్రకాష్, ట్రూ గాస్పల్ చర్చి దైవజనులు డా.ఈలి సత్య సువార్త రాజు, షాలెం బాప్టిస్ట్ చర్చి దైవజనులు డా.ఎం సాల్మన్ రాజులు ఏసుక్రీస్తు పుట్టుకకు సంబంధించి క్రైస్తవ ప్రజలకు బైబిల్ గ్రంథం నుండి పలు అంశాలను బోధించారు. ఈ సందర్భంగా చర్చి భవనాలపై ఏర్పాటు చేసిన విద్య దీపాలతో అలంకరించిన నక్షత్రాలను వెలిగించి క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. స్థానిక పిఠాపురం రోడ్‌లోని ఆంధ్ర జూబిలీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ ప్రజలు పిఠాపురం రోడ్డు పైకి వచ్చి సంఘ యువజన నాయకులు తయారుచేసిన నక్షత్రం వద్దకు చేరుకొని కొవ్వొత్తులను వెలిగించి నక్షత్రాన్ని వెలిగించగా రహదారి వెంబడి వెళ్లే ప్రజలు రహదారి వెంబడి వెళ్లే ప్రజలు, వాహనదారులు వాహనదారులు ఈ వేడుకలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు బిఎస్ వందనం, టి సూర్యారావు, బి అన్నపూర్ణ డానియల్, పిట్టా సత్యనారాయణ, ఐఈ జీవన్ కుమార్, ఆయా సంఘాలకు చెందిన యువజన నాయకులు, క్రైస్తవ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సుబ్రహ్మణ్య షష్టి మహా పర్వదినం పురస్కరించుకొని కాకినాడ జిల్లాలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పెద్దాపురం మండలం జి.రాగంపేటలో, సామర్లకోట పట్టణం శ్రీ జగదీశ్వర స్వామి ఆలయంలోనూ, సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలోని ఆలయంలో ఇంకా పెద్దాపురం నియోజక వర్గ పరిధిలో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జి రాగంపేట గ్రామంలోని ఆలయ ఆవరణలోని పుట్టల వద్ద భక్తులు భారీగా చేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవా రుజాము 4 గంటల నుండి ఆలయానికి భక్తులు చేరుకొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఎటువంటి అవాయించిన సంఘటనలు జరగకుండా పెద్దాపురం ఎస్ఐ మౌనిక, సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలో స్థానిక సిఐ ఎ కృష్ణ భగవాన్‌ల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, డ్రోన్‌ల సహాయంతో ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. అలాగే సామర్లకోట జగదీశ్వర స్వామి ఆలయంలో జరిగిన సుబ్రహ్మణ్య షష్ఠి పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో స్వామివారి కళ్యాణ పూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇంకా పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ భీమేశ్వరాలయంలో సుబ్రహ్మణ్య స్వామి ఉపాలయంలో ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు.

# భక్తుల సేవలో రామకృష్ణ సేవా సమితి





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గల శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి సభ్యులు బిక్కవోలు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి సందర్భంగా భక్తులు, చంటి పిల్లలకు, మహిళలకు, వృద్ధులకు సేవలు అందజేశారు. ఉచితంగా పాలు, బిస్కెట్లు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో గత 36 సంవత్సరాల నుండి సమితి సభ్యులు పాలు, బిస్కెట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో గల ఔత్సాహికులైన భక్తులు, ఆదిత్య యూనివర్సిటీలో గల సిబ్బంది, సమితి సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా ఈ ఉత్సవాల్లో సుమారు 500 లీటర్ల పాలు సేకరించి 3000 మందికి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి గౌరవ సభ్యులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ, సమితి కార్య దర్శి వింజమూరి విశ్వనాథ్, డా.తోటకూర రాజీవ్, నువ్వుల వెంకట రాజు, ఆచంట సత్యనారాయణ, టి.వి.వి.సత్యనారాయణ, నువ్వుల బాబ్జి, సూర్యచంద్రరావు, తోటకూర గంగాభవాని, దుర్గాలక్ష్మి, పి నాగదేవి, భార్గవి, ఆచంట వెంకటేశ్వరావు, మాచరావు, మల్లిపూడి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

**సామర్లకోట/పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజక వర్గంలో భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య ఆధ్వ ర్యంలో, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో కె హిమ మహేశ్వరి, పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో కె వెంకట సూర్య నారాయణ ఆధ్వర్యంలో, సామర్లకోట రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో, సామర్ల కోట బ్రౌన్ పేట డా. అంభేత్కర్ పార్క్‌లో అంభేత్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో, సామర్లకోట ఐఎం ఎల్ డిపోలో డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు అధికారులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి, హారతులిచ్చి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమాల్లో దళిత సంఘాల నాయకులు లింగం శివప్రసాద్, బీపల్లి పండు, నేతల హరిబాబు, నూతలపాటి సత్తిబాబు, ఆయా కార్యాలయాల సిబ్బంది, ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న చోటే వెతుక్కుంటున్న దిల్ రాజు



టాలీవుడ్‌లో అగ్ర నిర్మాతగా వెలుగొందుతున్న దిల్ రాజుకు బాలీవుడ్ మీద ఎప్పటి నుంచో కన్నుంది. అక్కడ కూడా తన మార్క్ చూపించాలని చాలా ప్రయత్నాలు చేశారు. కానీ దురదృష్టవశాత్తు ఆయన వేసిన ప్లాన్స్ బాక్సాఫీస్ దగ్గర బెడిసికొట్టాయి. అయినా సరే వెనక్కి తగ్గకుండా, ఇప్పుడు మరో భారీ ప్రయోగానికి సిద్ధమయ్యారు. ఈసారి మామూలు కంటెంట్‌తో కాదు, తెలుగు బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఒక మాస్ మసాలా సబ్జెక్ట్‌తో నార్త్ ఆడియన్స్‌ను టార్గెట్ చేశారు. గతంలో కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలను నమ్మి హిందీలో రీమేక్ చేస్తే దిల్ రాజుకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. నాని 'జెర్సీ', విశ్వక్ సేన్ 'హిట్' వంటి సినిమాలు తెలుగులో ఎంత పెద్ద హిట్టయ్యాయో తెలిసిందే. కానీ హిందీలో మాత్రం అవి డిజాస్టర్స్ గా మిగిలాయి. థియేట్రికల్ గా అవి నిర్మాతలకు నష్టాలనే మిగిల్చాయి. అందుకే ఈసారి స్ట్రాటజీ మొత్తం మార్చేశారు. క్లాస్ సినిమాలు కాకుండా, పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్‌ను ఎంచుకున్నారు. అసలు విషయం ఏంటంటే.. తెలుగులో ఏకంగా 300 కోట్లు కొల్లగొట్టి సంక్రాంతి విన్నర్‌గా నిలిచిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాను దిల్ రాజు హిందీలో రీమేక్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్ ఖలాడీ అక్షయ్ కుమార్‌ను హీరోగా లాక్ చేశారు. కామెడీ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన డైరెక్టర్ అనీస్ బాజ్మీ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌తో దిల్ రాజు బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతంలో హిందీలో చేసిన సినిమాలు వేరే నిర్మాతలతో కలిసి చేసిన జాయింట్ వెంచర్స్. కానీ ఈసారి దిల్ రాజు ఈ ప్రాజెక్ట్ ను చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. మరీ ఎక్కువ మంది పార్ట్నర్స్ లేకుండా, తానే దగ్గరుండి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్ట్ సినిమాలు, ప్రయోగాత్మక చిత్రాల జోలికి పోకుండా, ఆడియన్స్‌కు నచ్చే పక్కా మాస్ ఎంటర్టైనర్ అయితేనే సేఫ్ అని ఆయన బలంగా ఫిక్స్ అయినట్లు కనిపిస్తోంది. అందుకే ఈ బ్లాక్ బస్టర్ కథను ఎంచుకున్నారు. ఈ సినిమాను 2026 క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలి.. అనే సామెతను దిల్ రాజు గట్టిగా ఫాలో అవుతున్నారు. గత పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకుని, ఈసారి ఎలాగైనా బాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర హిట్టు కొట్టాలని కసిగా ఉన్నారు. అక్షయ్ కుమార్ కామెడీ టైమింగ్, అనీస్ బాజ్మీ మేకింగ్ స్టైల్ ఈ సినిమాకు ప్లస్ అవుతాయని నమ్ముతున్నారు. దిల్ రాజు వేస్తున్న ఈ కొత్త స్కెచ్ వర్కవుట్ అయితే, బాలీవుడ్‌లో ఆయన జెండా పాతినట్లే. తెలుగులో 300 కోట్లు సాధించిన ఈ సినిమా, హిందీలో అక్షయ్ మార్క్‌తో ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి. వరుస ఫ్లాపుల్లో ఉన్న అక్షయ్‌కి, బాలీవుడ్‌లో సాలిడ్ హిట్ కోసం చూస్తున్న దిల్ రాజుకు ఈ సినిమా చాలా కీలకం కానుంది.

# చరణ్- సుక్కూ మూవీ.. ఆడియన్స్ కు పెద్ద సర్ప్రైజ్?



టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్, లెక్కల మాస్టర్ సుకుమార్ కాంబినేషన్ మరోసారి రిపీట్ కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ సినిమా అనౌన్స్మెంట్ గత ఏడాది చరణ్ బర్త్ డే నాడు వచ్చేసింది. దీంతో అప్పటి నుంచే మూవీపై ఆడియన్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా అప్డేట్స్ కోసం అంతా ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. నిజానికి.. ఇప్పటికే చరణ్, సుకుమార్ కలిసి రంగస్థలం మూవీ చేశారు. 2018లో రిలీజ్ అయిన ఆ సినిమా.. బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. చరణ్ క్రేజ్‌ను విపరీతంగా పెంచింది. భారీ వసూళ్లు రాబట్టిన రంగస్థలం.. ఆల్ టైమ్ క్లాసిక్ మూవీగా టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందనే చెప్పాలి. దీంతో ఇప్పుడు రామ్ చరణ్ కోసం సుక్కూ ఎలాంటి కథ రెడీ చేస్తున్నారోనని అనేక మంది నెటిజన్లు, సినీ ప్రియులు, అభిమానులు డిస్కస్ చేసుకుంటున్నారు. రంగస్థలం మూవీ విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో పీరియాడిక్ ఫిల్మ్‌గా తెరకెక్కగా.. ఇప్పుడు ఏ జోనర్‌లో సుకుమార్ స్టోరీ సిద్ధం చేస్తున్నారోనని అంతా మాట్లాడుకుంటున్నారు. అయితే ఇప్పుడు రామ్ చరణ్ – సుకుమార్ కొత్త సినిమా రంగస్థలం లాంటి జోనర్ కాదని తెలుస్తోంది. కంప్లీట్ మోడ్రన్ స్టోరీతో మూవీ ఉండబోతుందట. ఆ విషయాన్ని నిర్మాత, మైత్రీ మూవీ మేకర్స్ అధినేత రవిశంకర్ యలమంచిలి రీసెంట్‌గా రివీల్ చేశారు. సమకాలీన కథతోనే చెర్రీ– సుక్కూ మూవీ ఉండబోతుందని తెలిపారు. దీంతో సినిమాలో రామ్ చరణ్ లుక్.. కచ్చితంగా అల్ట్రా స్టైలిష్ మోడ్‌లోనే ఉండబోతుందని అంతా అంచనా వేస్తున్నారు. హీరో లుక్‌తో సుకుమార్.. అభిమానులకు పెద్ద సర్ప్రైజ్ ఇస్తారని ఎక్స్పెక్ట్ చేస్తున్నారు. నిజానికి.. లెక్కల మాస్టర్ ప్లానింగే వేరు. ఏ మూవీకి అయినా హీరోల లుక్స్ విషయంలో కంప్లీట్ భిన్నంగా వర్క్ చేస్తారు. అయితే ఇప్పటికే పలు సినిమాల్లోని హీరోలను ఫుల్ స్టైలిష్‌గా చూపించారు. వన్ నేనొక్కడినే మూవీలో మహేష్ బాబు, నాన్నకు ప్రేమతో సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ లుక్స్‌కు అంతా ఫిదా అయ్యారు. వారిద్దరిని సుకుమార్ చూపించిన విధానంపై ప్రశంసల వర్షం కురిపించారు.

ఇప్పుడు రామ్ చరణ్‌ను ఇంకా సూపర్‌గా చూపించబోతున్నారని నెటిజన్లు, ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. మరి చూడాలి సుకుమార్ ప్లాన్ ఎలా ఉంటుందో? ఎలా సర్ప్రైజ్ చేస్తారో? ప్రస్తుతం ఆయన స్క్రిప్ట్ ను పూర్తి చేసే పనిలో ఉన్నారని వినికిడి.

# ధనుష్‌తో 'అమరన్' రిపీట్...!



గత ఏడాది కోలీవుడ్ నుంచి వచ్చిన 'అమరన్' సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన అమరన్ సినిమాను కమల్ హాసన్ నిర్మించాడు. ఈ సినిమాకు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించాడు. ఒక బయోపిక్ ను అది కూడా ఒక ఆర్మీ ఆఫీసర్ బయో పిక్‌ను ఇంత చక్కగా, కమర్షియల్ ఎలిమెంట్స్ మరీ ఎక్కువ కాకుండా నేచురల్‌గా తీశాడు అంటూ దర్శకుడిపై ప్రశంసలు కురిపించారు. కేవలం తమిళ్, తెలుగు భాషల్లోనూ కాకుండా అమరన్ సినిమా అన్ని భాషల్లోనూ మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో దర్శకుడు రాజ్ కుమార్ పెరియ సామికి వరుస ఆఫర్లు వచ్చినట్లు తమిళ మీడియాలో కథనాలు వచ్చాయి. కానీ ఆయన మాత్రం ఆచితూచి తన తదుపరి సినిమా విషయంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2017లో రంగూన్ సినిమాను తీసిన రాజ్ కుమార్ పెరియసామి దాదాపు ఏడు ఏళ్ల గ్యాప్ తర్వాత 'అమరన్' సినిమాతో వచ్చాడు. తదుపరి సినిమా వెంటనే ఉంటుందని అనుకున్నప్పటికి ఆలస్యం అయింది. అమరన్ సినిమా వచ్చి ఏడాది దాటింది. అయినా ఇప్పటి వరకు ఈ దర్శకుడు కొత్త సినిమాను ప్రకటించలేదు. ఎట్టకేలకు ఈయనకు ధనుష్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించిందనే వార్తలు వస్తున్నాయి. ధనుష్ హీరోగా రాజ్ కుమార్ పెరియ సామి దర్శకత్వంలో ఒక సినిమాకు ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ సినిమాలో హీరోయిన్‌గా సాయి పల్లవిని ఎంపిక చేశారని తెలుస్తోంది. అమరన్ సినిమా కోసం రాజ్ కుమార్ పెరియ సామి, సాయి పల్లవి కలిసి వర్క్ చేసిన విషయం తెల్సిందే. అందుకే వీరిద్దరిది హిట్ పెయిర్‌గా ఇప్పటికే మంచి పేరు దక్కిన విషయం తెల్సిందే. అమరన్ సినిమా హిట్ నేపథ్యంలో ఆ కాంబో రిపీట్ కాబోతున్న నేపథ్యంలో సహజంగానే అంచనాలు భారీగా ఉంటాయి. పైగా అమరన్ కాంబోతో హీరో ధనుష్ కలిస్తే మరింత గొప్పగా సినిమా ఉంటుంది అనేది సినీ విశ్లేషకుల అభిప్రాయం. విభిన్న చిత్రాలను తీస్తున్న దర్శకుడు రాజ్ కుమార్ మరోసారి ధనుష్ కోసం ఏకంగా ఏడాది పాటు వెయిట్ చేసి మరీ ఒక మంచి కథను రెడీ చేసినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే సినిమాను అధికారికంగా ప్రకటించి, వచ్చే ఏడాది ఆరంభంలోనే షూటింగ్ ప్రారంభించే విధంగా ప్లాన్ చేస్తున్నట్లుగా కోలీవుడ్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ధనుష్ ఉన్న బిజీ షెడ్యూల్ కారణంగా ఈ సినిమా కాస్త ఆలస్యం అయ్యే అవకాశాలు లేకపోలేదు అని ఇండస్ట్రీ వర్గాల వారు, మీడియా సర్కిల్స్ వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు అమరన్ సినిమా కోసం రాజ్‌కుమార్, సాయి పల్లవి కలిసి వర్క్ చేయగా, మరోవైపు మారి 2 సినిమా కోసం ధనుష్‌తో కలిసి సాయి పల్లవి వర్క్ చేసిన విషయం తెల్సిందే. మారి 2 సినిమా ఫలితంతో సంబంధం లేకుండా ఆ సినిమాలోని రౌడీ బేబీ పాట ఏ స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకుందో తెలిసిందే. 2018లో వచ్చిన ఆ సినిమాలోని పాట ఇప్పటికీ యూట్యూబ్‌తో పాటు అన్ని చోట్ల మారుమ్రోగుతూనే ఉంది. ఆ పాటలో సాయి పల్లవి డాన్స్, ధనుష్ లుక్, అన్ని కూడా భలే సెట్ కావడంతో పాట సూపర్ హిట్ అయింది. ఇప్పుడు అలాంటిదే మరోటి పాట పడితే బాగుంటుందని అభిమానులు కోరుకుంటున్నారు. మరి దర్శకుడు రాజ్ కుమార్ పెరియాసామి ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు అనేది చూడాలి. ధనుష్ నేడు తేరే ఇష్క్ మే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. మరిన్ని సినిమాలు ఆయన నుంచి రాబోతున్నాయి. 2026 చివరి వరకు రాజ్ కుమార్ దర్శకత్వంలో ధనుష్, సాయి పల్లవిల మూవీ పూర్తి అయ్యి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# సంక్రాంతికి ఆ సినిమా డౌటేనా..?



2026 పొంగల్‌కి చాలా సినిమాలు రిలీజ్ ప్లాన్ చేసుకున్నాయి. స్టార్ సినిమాలతో పాటు మీడియం రేంజ్ హీరోలు, యువ హీరోల సినిమాకు ఈ ఫైట్‌కి రెడీ అవుతున్నాయి. ఆల్రెడీ సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి మన శంకర వరప్రసాద్‌తో పాటు రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ రిలీజ్ లాక్ చేశారు. ఆ సినిమాతో పాటు మాస్ మహారాజ్ రవితేజ ఫ్యామిలీ ఎంటర్టైనర్ భర్త మహాశయులకు విజ్ఞప్తి కూడా రిలీజ్ ఫిక్స్ చేశారు. ఈ సినిమాలతో పాటు నవీన్ పొలిశెట్టి అనగనగా ఒక రాజు కూడా రిలీజ్ అవుతుంది. ఐతే ఇదే లైన్‌లో శర్వానంద్ నారి నారి నడుమ మురారి సినిమా రిలీజ్ కూడా సంక్రాంతికే అనౌన్స్ చేశారు. ఏకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో అనీల్ సుంకర ఈ సినిమా నిర్మిస్తున్నారు. సామజవరగమన తర్వాత రామ్ అబ్బరాజు ఈ మూవీ డైరెక్ట్ చేశారు. ఐతే ఈ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నట్టు పోస్టర్స్ వదిలారు. కానీ చూస్తుంటే ఇది సంక్రాంతి రేసు నుంచి తప్పుకునేలా ఉంది. ఎందుకంటే పొంగల్ ఫైట్ ఈసారి భారీగా ఉండబోతుంది. అంతేకాదు శర్వానంద్ బైకర్ సినిమా డిసెంబర్ 6న రిలీజ్ అవుతుంది. ఆ సినిమా రిలీజైన నెల 15 రోజుల్లో మరో సినిమా అంటే రెండు వెంట వెంట నెలల్లో రెండు సినిమాలు రిలీజ్ ఎందుకనే భావనతో కూడా నారి నారి నడుమ మురారి సినిమాను వాయిదా వేసే ప్లాన్‌లో ఉన్నారట. ఈ సినిమా జనవరి మిస్సైతే సమ్మర్‌కి షిఫ్ట్ అవుతుందని టాక్. రామ్ అబ్బరాజు సామజవరగమన స్టైల్‌లోనే నారి నారి నడుమ మురారి సినిమా తెరకెక్కించారని తెలుస్తుంది. ఈ సినిమాలో శర్వానంద్ సరసన సాక్షి వైద్య, సంయుక్త మీనన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. శర్వానంద్ చివరగా మనమే సినిమాతో వచ్చాడు. ఆ సినిమా రిజల్ట్ కూడా డిజప్పాయింట్ చేసింది.

ఐతే బైకర్‌తో మాత్రం కచ్చితంగా సక్సెస్ టార్గెట్ పెట్టుకున్నాడు శర్వానంద్. ఇండియన్ స్క్రీన్ మీద బైక్ రేస్ బ్యాక్ డ్రాప్‌లో వచ్చిన సినిమాలు చాలా తక్కువ. అందుకే ఈ సినిమా ఎక్స్‌పీరియన్స్ కచ్చితంగా ఆడియన్స్‌ని థ్రిల్ అయ్యేలా చేస్తుందని అంటున్నారు. సో బైకర్ ఒక క్రేజీ అటెంప్ట్ కాగా శర్వానంద్ ఎంటర్టైనర్ యాంగిల్‌లో నారి నారి నడుమ మురారి చేస్తున్నాడు. ఈ రెండు సినిమాలతో ఎలాగైనా హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తున్నాడు శర్వానంద్.తెలుగు ఆడియ న్స్‌కి ఒక డిఫరెంట్ సినిమాలు అందిచాలని చూస్తున్న శర్వా నంద్ కెరీర్‌లో సక్సెస్‌ల కన్నా ఫెయిల్యూర్స్ ఎక్కువ ఫేస్ చేశాడు. ఐతే మనమే తర్వాత ఈసారి గట్టి ఎఫర్ట్స్‌తో బైకర్, నారి నారి నడుమ మురారి సినిమాలు చేస్తున్నాడు. బైకర్ ఒక ఎక్స్ పెరిమెంట్ మూవీగా వస్తుంది. ఐతే ఈ సినిమాలో ఎమోషన్స్ అదిరిపోతాయని టాక్.

# క్రమశిక్షణతో కూడిన విద్యయే భవిష్యత్తుకు పునాది

## - చదువు, క్రమశిక్షణ అలవరచుకున్నప్పుడే ఉజ్వలమైన భవిష్యత్తు సాధ్యం : మెజిస్ట్రేట్ ఎ.విజయ్ రాజ్ కుమార్



**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** విద్యాభ్యాసన సమయంలోనే విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని గజపతినగరం ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన బొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్.ఎం ఉమామహేశ్వరరావు అధ్యక్షతన భారత రాజ్యాంగ దినోత్సవము, వరకట్నం నిషేధ దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్న గజపతినగరం ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ ఏ విజయ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణే విద్యకి పునాది అని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మంచి మాటలను విద్యార్థులు ఆచరించాలని అన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ అలవాటు పడినపుడే ఉన్నత శిఖరాలను చేరుకోగలమని ఆయన స్పష్టం చేసారు. విద్యార్థులు, పాఠశాలలోనే క్రమశిక్షణకు అలవాటు పడటం ద్వారా భవిష్యత్ లో మంచి ఉద్యోగాలు సాధించవచ్చునని అయన ఆశాభావం వ్యక్తం చేసారు. పదిమందిలో ఒకరిగా కాకుండా, పదిమందికి స్ఫూర్తి వంతంగా నిలవాలంటే క్రమశిక్షణే గీటురాయని మేజిస్ట్రేట్ ఎ.విజయ్ రాజ్ కుమార్ స్పష్టం చేసారు. సమాజంలో వరకట్నం పెనుభూతంగా ఉందని చట్టాలు ద్వారా కొంతవరకు అరికట్టేందుకు కృషి చేసున్నామని అన్నారు. విద్యార్థులకు మేజిస్ట్రేట్ ఎ.విజయ్ రాజ్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేత్కర్ చిత్రపటానికి మేజిస్ట్రేట్ ఎ.విజయ్‌రాజ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సి.వాసుదేవరావు, సాయిశేఖరరావు, పి.ఇ టి గెద్ద గురునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు చేరుకున్న అంచనాల కమిటీ







**విజయనగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర అంచనాల కమిటీ బుధవారం సాయంత్రం జిల్లాకు చేరుకుంది. కమిటీ చైర్మెన్ వి. జోగేశ్వరరావు, సభ్యులు నిమ్మక జయకృష్ణ, డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజులకు జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, డియార్వో ఎస్. శ్రీనివాసమూర్తి స్థానికంగా ప్రైవేటు అతిథిగృహం వద్ద పుష్ప గుచ్చాలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాకు సంబంధించిన విషయాలపై కొద్దిసేపు చర్చించారు. అంతకుముందు కమిటీ ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం రామనారాయణం సందర్శించింది. వీరికి అక్కడ ఆర్డీవో డి.కీర్తి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష స్వాగతం పలికారు.

# లేబర్ కోడ్లు వద్దే వద్దు




**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలంటూ సిఐటియు నాయకులు బుధవారం పట్టణ నాలుగు మాడవీధుల్లో నిరసన తెలిపారు. అఖిల భారత సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు కార్మిక సంఘాలు నిరసన, ఉల్లంఘనకు దిగాయి. కార్పొరేట్ల అండ దండలతో జీవితకాలం అధికారంలో ఉండాలన్న కాంక్షతో మోడీ కార్మిక చట్టాలను సవరిస్తున్నాడని సీఐటీయూ జిల్లా ఉపాధ్య క్షులు అంగేరి పుల్లయ్య ఆరోపించారు. ఫలితంగా కార్మికులు తమ హక్కులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్లపై వెనక్కి తగ్గకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెనగడం గురవయ్య, గంధం మణి, వెంకటేష్, వేణు, సంక్రాంతి వెంకటయ్య, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిగొప్ప రాజ్యాంగం : జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిగొప్పదని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ భారత రాజ్యాంగాన్ని తెలుసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 13 మంది విజేతలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను, మెడల్స్‌ను పంపిణీ చేసి అభినందించారు. అలాగే మాక్ అసెంబ్లీ ద్వారా రాష్ట్రస్థాయికి ఎంపికైన మరో 8 మంది జిల్లా విద్యార్థులను కూడా ప్రశంసించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు. మన రాజ్యాంగ పరిషత్ 1949 నవంబరు 26వ తేదీన రాజ్యాంగాన్ని ఆమోదించిందని, జనవరి 26 నుంచి



అమల్లోకి వచ్చిందని చెప్పారు. ఈ రాజ్యాంగాన్ని దేశప్రజలమైన మనము మనకే సమర్పించుకోవడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ యు.మాణిక్యంనాయుడు, ఏపిసి సన్యాసిరాజు, ఇతర అధికారులు, విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం ప్రతిఒక్కరికీ మార్గదర్శకం

## - ఇంచార్జ్ కమిషనర్ ఎన్ వి వి సత్యనారాయణ






**కాకినాడ, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగం ప్రతిఒక్కరికీ మార్గదర్శకమని ఇంచార్జ్ కమిషనర్ ఎన్ వివి సత్యనారాయణ అన్నారు. 76వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ కమిషనర్ ఎన్‌వివి మాట్లాడుతూ.. దేశ పౌరులందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందిస్తూ రూపొందించబడిన మన భారత రాజ్యాంగం 1949, నవంబర్ 26న ఆమోదించబడిన సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగమనేది ఒక దిక్సూచి లాంటిదని.. కుల, మత, లింగ, ప్రాంత, భాష వివక్ష లేకుండా దేశ పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందన్నారు. అన్ని దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వం దేళ్ల ముందు చూపుతో ఓ బలమైన రాజ్యాంగాన్ని రూపొందిం చారని వెల్లడించారు. ఆ మహనీయుని కృషి ఫలితంగానే ప్రపం చంలోని అనేక దేశాల



రాజ్యాంగాల కంటే భారత రాజ్యాంగం ఉన్నత విలువలు కలిగిందంటూ వివరించారు. అనంతరం భారత రాజ్యాంగ ప్రవేశికను అందరి చేత చదివించారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ కమిషనర్ కే.శ్రీనివాస్, ఎస్.ఈ. పి. వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్, డిసిపి కృష్ణారావు,ఏసీపీ శ్రీధర్ డిపిఆర్ఓ శైలజ, మేనేజర్ సీతారాం, అకౌంటెంట్ రామశాస్త్రి, తదితర అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమాన్ని పర్యవేక్షించిన జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్

**విజయనగరం/ మెరకముడిదాం, (రాజధాని వార్తలు):** మెరకముడిదాం మండలం బుధరాయవలస గ్రామంలో నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామంలో సాగుతున్న రైతు సర్వే, పంటల స్థితి, పంట నష్టాల అంచనా, రైతులకు అందుతున్న సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రైతు సమస్యలు, సూచనలు, అవసరాలు గ్రామ స్థాయిలోనే తెలుసుకొని వాటిని వెంటనే సంబంధిత విభాగాల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ప్రతి ఇంటిని సందర్శించి సర్వేను ఖచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ



కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి రెస్క్యూ స్టేషన్‌లో భోజనం ఏర్పాటు చేయాలి

**గోదావరిఖని, (రాజధాని వార్తలు):** సింగరేణి రెసిక్యూ స్టేషన్‌లో భోజనం ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేస్తు బుధవారం రామగుండం సింగరేణి రేస్క్యూ స్టేషన్ సూపరింటెండెంట్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగినది. ప్రతి నెల రెస్క్యూ ప్రాక్టీస్కు వచ్చేవారికి ఇంతకు ముందులాగానే స్టేషన్‌లోని క్యాంటీన్లో ఉదయం టీ, ప్రాక్టీస్ అయిన తర్వాత భోజనంతో పాటు ప్రోటీన్ కోసం రెండు కోడిగ్రుడ్లు ఏర్పాటు చేసేవారు ఇప్పుడు అది గెస్ట్ హౌస్‌కు మార్చడం వలన అక్కడ సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు అని ఆవేదన చెందారు. భోజనం కూడా సరిగా ఉండటం లేదు అని ఈ విషయమై ఈరోజు ప్రాక్టీస్కు వచ్చి నటువంటి యాక్టీవ్ రేస్క్ ట్రైన్డ్ పర్సన్స్ సూపరింటెండెంట్ అందుబాటులో లేని కారణంగా ఇన్స్ట్రక్టర్ శ్రీ తిరుపతికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మీరు నాకు ఇచ్చినటువంటి వినతిపత్రాన్ని



సూపరింటెండెంట్ వచ్చిన తర్వాత వారి దృష్టికి తీసుకుపోయి ఈ సమస్య పరిష్కా రానికి కృషి చేస్తానని మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో యాస శ్రీనివాస్, చల్లా రవీందర్ రెడ్డి,మిట్ట శంకరయ్య, మడికంటి శ్రీనివాస్ శివ అర్జున్ సింగ్ మరియు ఇతర రెస్క్యూ సభ్యులు పాల్గొన్నారు.

# వైకాపా ఆధ్వర్యంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం మాజీ శాసన సభ్యులు బొత్స అప్పల నరసయ్య ఆదేశాలకు అనుగుణంగా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్ సూచనలతో గజపతినగరం వైకాపా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి రెట్టంగి గోపాల్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం నియోజకవర్గం వీవర్స్ వింగ్ అధ్యక్షులు ఊజూరు శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి ఆల్తి రామునాయుడు, వార్డ్ మెంబర్ బూరెల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయశాఖ సిబ్బంది అందరి చేత రాజ్యాంగ పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.భవిత






**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాజ్యాంగం సార్వభౌమ లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగం అని ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనదే నన్నారు.

ఈ చారిత్రక రోజును పురస్కరించుకొని రాజ్యాంగ విలువలు పౌర హక్కులు మరియు బాధ్యతలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టబ డిందని తెలియజేశారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగం 1946 సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన రోజును రాజ్యాంగ దినోత్స వంగా పాటిస్తున్నామని రాజ్యాంగం యొక్క చరిత్ర గురించి తెలియజేశారు.

# రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు పరచాలి : అలవాల రాజా పెరియర్

**భద్రాచలం, (రాజధాని వార్తలు):** స్థానిక అంబేద్కర్ సెంటర్ భద్రాచలం నందు గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ యువతరం పార్టీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా సీనియర్ నాయకులు సామాజిక ఉద్యమ నేత అలవాల రాజా పెరియార్, యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గుజ్జాల వేణుగోపాల్ రెడ్డి, గుగులోతు బాబు,ఆటో జేఏసీ అధ్యక్షులు మర్మం శంకర్, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మేకల లతలు మాట్లాడుతూ...భారత రాజ్యాంగం అనేది భారతదేశ అత్యున్నత చట్టం అని, ఇది 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభచే ఆమోదించబడి, 1950 జనవరి 26న అమలులోకి వచ్చిందని వారు అన్నారు. భారత ప్రభుత్వ నిర్మాణం, పాలనా విధానాలు, పౌరుల హక్కులు మరియు విధులను ఇది నిర్దేశిస్తుందని,ఇది భారతదేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ప్రకటించిందని అన్నారు. అత్యున్నత చట్టం భారత రాజ్యాంగం దేశానికి అత్యున్నత చట్టం, ప్రభుత్వ సంస్థలు మరియు పౌరులందరూ దీనికి లోబడి ఉండాలని,. గణతంత్ర ప్రతిపత్తి 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత, భారతదేశం ఒక గణతంత్ర రాజ్యంగా అవతరించిందని ప్రభుత్వ నిర్మాణం శాసన, కార్యనిర్వాహక మరియు న్యాయ వ్యవస్థల ఏర్పాటు, వాటి అధికారాలను ఇది నిర్దేశిస్తుందని, ప్రాథమిక హక్కులు పౌరులకు సమానత్వ హక్కు, స్వాతంత్ర్య హక్కు, మత స్వేచ్ఛ వంటి అనేక ప్రాథమిక హక్కులను అందిస్తుందని, నిర్మాణం పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థతో కూడిన సమాఖ్య నిర్మాణాన్ని కలిగి ఉంటుందని, రూపకల్పన దీనిని రాజ్యాంగ సభ రూపొందించింది, దీనికి డా. బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షత వహించారని.అమలులోకి వచ్చిందని 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెల్లం సమ్మక్క, సూదిపాక రాజారావు, మంద నరేష్, నల్లగట్ల శివ, పూస శ్రీను, రమాదేవి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ ఆదిత్య స్కూల్ ఆవరణంలో రాజ్యాంగ దినోత్సవం కారణంగా విద్యార్థులతో మాక్ అసెంబ్లీ

## - రాజ్యాంగ దినోత్సవం భారతీయుల పండుగ - రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి - రాజ్యాంగం అమలుతోనే అభివృద్ధి






**ఎటపాక, (రాజధాని వార్తలు):** రాజ్యాంగ దినోత్సవం భారతీయుల పండుగ అని, దేశ ప్రజలందరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని శ్రీ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ కడియాల వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ అన్నారు. ఎటపాక మండలం తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్ ఆవరణంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు వివిధ పాత్రల్లో అధికార పక్షం , ఎమ్మెల్యేలు, మంత్రులుగా, ప్రతిపక్షం ఎమ్మెల్యేలు గా పాల్గొన్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్లుగా పాత్రలు పోషించారు. అసెంబ్లి సమావేశాల్లో ఏవిధంగా సమస్యలపై చర్చిస్తారో విద్యార్థులు వారి పాత్రల్లో కళ్లకు కట్టెల చూపించడం ప్రత్యేకంగా నిలిచింది. మహిళా ఎమ్మెల్యేలుగా ఆయా పాత్రల్లో పాల్గొన్న విద్యార్థులు ప్రత్యేకవస్త్ర ధారణలో రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థులకు రాజ్యాంగంపై పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు మాక్ అసెంబ్లి నిర్వహించామన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు, భవిష్యత్తులో కాబోయే ప్రజా ప్రతినిధులు కావచ్చని గుర్తు చేశారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన దినాన్ని 2015



నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవం(సంవిధాన దివాస్)గా నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 1949లో నవంబర్ 26న రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని అధికారికంగా ఆమోదించిందన్నారు. రాజ్యాంగ పీఠిక రాజ్యాంగానికి ఆత్మగా నిలుస్తుందని చెప్పారు. పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికా, శ్రీనివాసరావు, అప్పాజీ, సంధ్య, ప్రసన్న, జ్యోష్ణ, వరలక్ష్మి, నాగేంద్రమ్మ, కృపా, జయంతి, వాసవి, ఇమాన్షి, వెంకటలక్ష్మీ, శివదేవి, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 5 మంది నిందితులకు జరిమానా, ఐదుగురికి జైలుశిక్ష




## - విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్

**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం రూరల్ సర్కిల్ పరిధిల్లో రూరల్ మరియు గంట్యాడ పోలీసులు ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం సేవించి, వాహనాలు నడిపిన 10 మంది వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 10 మందిని విజయనగరం స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (ఎక్సైజ కోర్ట్) శ్రీమతి శ్రీవిద్య వారి వద్ద హాజరుపర్చగా 5 మంది నిందితులకు ఒక్కొక్కరికి రూ. 10,000 లు చొప్పున జరిమానా మరియు ఐదుగురు నిందితులకు 5 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.

# పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

## - ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని భూదేవిపేట గ్రామానికి చెందిన వివాహిత మహిళ కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు బుధవారం తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం, భూదేవిపేట గ్రామానికి చెందిన జగ్గినేని గౌరీ (43) తరచూ కడుపునొప్పికి గురవుతుంది. ఈ నొప్పి భరించలేని గౌరీ ఈనెల 25వ తేదీన గడ్డి మందు తాగింది. వెంటనే గౌరీని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. కుమార్తె డొంకా పూజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కిరణ్ కుమార్ నాయుడు చెప్పారు.



# రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అబ్జర్వర్ తమిళనాడు ఎంపీ సుధా రామకృష్ణ పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ సుధా రామకృష్ణన్ మాట్లాడుతూ భారతదేశ పౌరులకు సమాన హక్కుల కల్పనకై, బడుగు బలహీన వర్గాల వారు అభివృద్ధి చెందాలంటే రిజర్వేషన్ల ద్వారా సాధ్యమవుతుందని వారు ఆర్థిక స్వాలంబన పొందాలని మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. డిసిసి అధ్యక్షులు బాలగురువం బాబు మాట్లాడుతూ నేడు సమాజంలో అసమానతలు తొలగి బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతున్నారంటే అది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించినటువంటి రాజ్యాంగం వల్లేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చింతా మోహన్, పీసీసీ పరిశీలకులు మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి కలిందర్, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, గూడూరు



నియోజకవర్గ సమన్వయకర్త భాస్కర్, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త హరి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీను గౌడ్, జిల్లా కోశాధికారి వేలు, జిల్లా ఉపాధ్యక్షులు శబరి రాజన్ రెడ్డి,ఎస్ టి సెల్ జిల్లా అధ్యక్షులు జ్యోతిశ్వర్ నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫయాజ్, గౌస్ బాషా, కె కె సి ఉపాధ్యక్షులు కృపానందం, కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి, వెంకటేష్ గౌడ్ మరియు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అతిపెద్ద రాజ్యాంగం ...భారత రాజ్యాంగం : ఎం.పీ.డీ.వో బి.కళ్యాణి

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం భారత రాజ్యాంగం అని స్థానిక ఎంపీడీవో బి. కళ్యాణి అన్నారు. 76వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపరెంటెండెంట్ పుష్ప, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ విభాగం, తిరుపతి వారిచే పౌష్టికాహారం పంపిణీ






**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా లేప్రోసి, ఎయిడ్స్ మరియు టిబి నివారణ అధికారి వారి కార్యాలయం సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లల అవసరాల పై వివిధ శాఖల సిబ్బం దితో సమన్వయ సమావేశం జిల్లా వైద్యాధికారి డా.బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించినట్టు జిల్లా లేప్రసి ఎయిడ్స్ మరియు టీబి అధికారి డా.పి.శైలజ. తెలియజేసారు. జిల్లా లెప్రసి ఎయిడ్స్ మరియు టీబి అధికారి మాట్లాడుతూ హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లలు మరియు వారి కుటుంబ సభ్యులు, స్వచ్చంద సంస్థలు మరియు విధ్యా శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖవారితో సమన్వయ సమావేశము ఏర్పాటు చేయడమైనది. హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లలు అవసరాలు మరియు ఎదుర్కొటున్న సమస్య లను తెలుసుకొని వాటి పరిష్కారాల లక్ష్యంతో హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లలతో ఈ సమావేశము నిర్వహించారు. ప్రభావిత రోగులు తీసుకుంటున్న జాగ్రత్తలు, చర్యలను అడిగి తెలుసుకు న్నారు. హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లలు ఏ.ఆర్.టి మందులను సక్రమంగా తీసుకుంటూ, పౌష్టికాహారం తీసుకోవాలని తద్వారా ఆరోగ్యం మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. జిల్లా పరిధిలో ఉన్న మండలములలో హెచ్.ఐ.వి.తో జీవిస్తున్న మరియు హెచ్.ఐ.వి. ప్రభావితమైన 14 నుండి 25 సంవత్సరాల వయస్సు గల పిల్లలతో సమస్యలు మరియు అవసరాలు గుర్తింపు మరియు పరిష్కారానికి అవసరమైన చర్యల గురించి జిల్లా స్థాయి హెచ్.ఐ.వి./ఎయిడ్స్ ఎస్.వి.డి.ఎస్ స్వచ్చంద సేవా సంస్థ మరియు నెట్ వర్క్ సిబ్బంది కూడా భాగస్వామ్యం చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించేల చర్యలు తీసుకోవాలని సూచించడమైనది. ఇతర స్వచ్చంద సేవా సంస్థలు ముందుకు వచ్చి హెచ్.ఐ.వి./ఎయిడ్స్ కార్యాక్రమాలపై జిల్లా వ్యాప్తంగా విసృతంగా అవగాహన కల్పించాలని కోరారు.

అనంతరం పలు చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమమునకు జిల్లా లేప్రసీ, ఎయిడ్స్ మరియు టి.బి. అధికారి, డా.శైలజ, ఆర్ట్ నోడల్ ఆఫీసర్ డా. మల్లీశ్వరి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కోటిరెడ్డి, సురేంద్ర, మంజునాథ్, రమేష్ మరియు పలు స్వచ్చంద సేవా

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ అయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్స్ కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసాం

**- గతంలో తట్టెడు మట్టికి నోచుకోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేస్తున్నాం - గ్రామీణ అభివృద్ధికి ఉద్దేశించిన 15 ఆర్థిక సంఘ నిధులు గత ప్రభుత్వం దుర్వినియోగం చేసింది - సంక్షోభంలో వున్న ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పాలన కొనసాగుతుంది - ప్రజల సమస్యల పరిష్కారం కోసం నా ఇంటి తలుపు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి - అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాను - ప్రజా దర్బార్ కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు నిరంతర ప్రక్రియ : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**






**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజక వర్గంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్య సాధనలో కేవలం అధికారులే కాదు స్థానిక నాయకుల కూడా చొరవ చూపాలన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. విడవలూరు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటిని పరిష్కరించడమే ప్రజా దర్బార్ కార్యక్రమ లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కారించడానికే ప్రజల మధ్యకు వచ్చానన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాననని ఆమె హామీ యిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షోభంలో వున్న ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పాలన కొనసాగుతుందన్నారు. గ్రామీణ అభివృద్ధికి ఉద్దేశించిన 15 ఆర్థిక సంఘ నిధులు గత ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని, గతంలో తట్టెడు మట్టికి నోచుకోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. అర్హత ఉన్నా.. సాంకేతిక లోపాల కారణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే అవన్నీ ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా హామీ యిచ్చారు. ఎన్నికల సందర్భంగా యిచ్చిన ప్రతి వాగ్ధానాన్ని అమలు చేస్తామన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని ప్రజల క్షేమం కోరే ప్రభుత్వమన్నారు. అస్తవ్యస్తమైన పాలనా వ్యవస్థను చక్కదిద్ది చంద్రబాబు నాయుడు గాడిలో పెడుతున్నారని 18 నెలల వ్యవధిలో కూటమి ప్రభుత్వ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని భవిషత్తులోనూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏటూరి శ్రీహరి రెడ్డి, టిడిపి నాయకులు అడపాల శ్రీధర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, ఆడపాల జనార్ధన్ రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, సత్యం రెడ్డి, రామిశెట్టి వెంకటరర్లు, ఏసోబు, వెంకట రమణయ్య మరియు టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

# వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా భారత రాజ్యాంగ జన్మదిన వేడుకలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మనుబోలు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీరంపల్లిలో రాజ్యాంగ జన్మదినాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని అనేక విషయాలను వివరించారు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బోయ దాస్ మాట్లాడుతూ అంబేద్కర్ చేసిన సేవలను నిమ్మ నా జాతుల అభివృద్ధి కోసం రిజర్వేషన్ల కల్పించడంలో స్త్రీలకు సమాన హక్కులను కల్పించడంలోనూ వారు చేసిన కృషి అభినందనీయం అన్నారు అలాగే పాఠశాల సోషల్ స్కూల్ అసిస్టెంట్ ప్రభావతి మాట్లాడుతూ పిల్లలందరూ కలిసిమెలిసి ఉండాలని సంతోషంగా చదువుకోవాలని ప్రభుత్వం ఇచ్చే పథకాలను అందుకుంటూ హాయిగా జీవించాలని చెప్పారు.

అలాగే సైన్సు ఉపాధ్యాయుడు శ్రీనివాసులు సోమా పద్మా రత్నం మృదుల సరస్వతి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యా ర్థులు చేత మాకు పార్లమెంట్ అసెంబ్లీ నిర్వహణ వారి విధులు వివరంగా విపులంగా విద్యార్థులచే నిర్వహించడం జరిగింది తదుపరి వ్యాసరచనలు వక్తృత్వ పోటీలు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి వారికి బహుమతులను అందజేయడం జరిగింది.

# కార్మికుల భద్రత కోసం నూతన లేబర్ చట్టం హర్షణీయం

**గూడూరు, (రాజధాని వార్తలు):** కార్మికుల భద్రతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కార్మిక చట్టం హర్షణీయమని భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు నాలి మధుసూదన్ యాదవ్ ఒక ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సవరించిన కార్మిక చట్టాలపైన అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ, కార్మికులకు అవగాహన కల్పిస్తున్నా బిజెఎంఎస్ జాతీయ అధ్యక్షులు శాంత్ ప్రకాష్ జటావ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan